ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

సంగారెడ్డి మెదక్

5

జిల్లాల వార్తలు

బుధవారం 22 జనవరి 2025



ఐఐటీహెచ్‌లో శాటిలైట్ సదస్సు

గ్రామీణ, పెరీ అర్బన్ ప్రాంతాల్లోని సమస్యలకు సాంకేతికత ఆధారిత పరిష్కారాలను చూపడమే లక్ష్యం

250 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

7లో



ఆర్టీసీకి సంక్రాంతి పండుగ..

● రూ.13.72 కోట్ల ఆదాయం

సంగారెడ్డి అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలుగింటి పండగ సంక్రాంతి ఆర్టీసీ ఆర్థిక క్రాంతిని తీసుకొచ్చింది. సంక్రాంతిని పురస్కరించుకొని తమ సొంత ఊళ్లకు వెళ్లే వారి కోసం ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది డిపోల పరిధిలో ఈ నెల 9 వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. మెదక్ రీజియన్‌లోని ఆర్టీసీ ఎనిమిది డిపోల నుంచి 280 ప్రత్యేక బస్సులు నడపడంతో మెదక్ రీజియన్‌కు రికార్డు స్థాయిలో రూ.13 కోట్ల 72 లక్షల ఆదాయం సమకూరింది. ఇందులో ఈ నెల 9 వ తేదీ నుంచి 13 వ తేదీ వరకు నడిపిన బస్సుల ద్వారా రూ.6 కోట్ల 54 లక్షలు ఆదాయంరాగా, ఈ నెల 16 వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు రూ.7 కోట్ల 18 లక్షల ఆదాయం వచ్చింది. సంక్రాంతి పండగకు ముందు కంటే పండగ తర్వాత ఆర్టీసీకి అదనంగా రూ.64 లక్షల ఆదాయాన్ని ఆర్జించిందని అధికారులు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

● పార్టీలకతీతంగా నిజమైన లబ్ధిదారుల ఎంపిక ● గ్రామ సభల్లో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



కంది మండలం చేర్యాల గ్రామసభలో మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

కంది, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అర్హులందరికి అందిస్తామని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. కంది మండలంలోని కాశీపూర్, చేర్యాల గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గ్రామసభలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకతీతంగా నిజమైన లబ్ధిదారులను ఎంపికచేసి ప్రభుత్వ పథకాలను అందించడానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాల చేరువ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా గ్రామసభలు నిర్వహిస్తోందన్నారు. గ్రామసభలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి జూలకంటి అంజనేయులు, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోతీలాల్, డిప్యూటీ తహసీల్దార్ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రావణ్‌కుమార్, గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు వెంకట్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



గ్రామసభకు హాజరైన నాయకులు, గ్రామస్థులు

నిలదీతలు.. వాగ్వాదాలు

తొలిరోజు రసాభాసగా గ్రామ, వార్డు సభలు

- ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా జాబితాలపై గగ్గోలు
- కొత్త రేషన్‌కార్డుల కోసం మళ్లీ దరఖాస్తుల వెల్లువ
- పలు గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం
- పలుచోట్ల పథకాల్లో లోటుపాట్లపై నిలదీసిన ప్రజలు
- 24వ తేదీ వరకు కొనసాగనున్న సభలు

ఇందిరమ్మ ఇళ్లు.. రైతుభరోసా.. కొత్త రేషన్‌కార్డులు.. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడానికి నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సభలు తొలిరోజు రసాభాసగా మారాయి. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో మంగళవారం అధికారుల నేతృత్వంలో సభలను ప్రారంభించారు. ఈ నెల 26 నుంచే ఈ పథకాలను ప్రారంభిస్తున్న నేపథ్యంలో అర్హుల జాబితాలో తమ పేరు ఉందో.. లేదోననే ఆతృతతో ప్రజలు సభలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పథకాల జాబితాలో పేర్లు లేనివారు అధికారులను నిలదీశారు. ఇక చాలా సభల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య వాగ్వాదాలు తలెత్తాయి. నేడు, రేపు, ఎల్లుండి కూడా సభలు కొనసాగనున్నాయి.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 21: సంక్షేమ పథకాలకు సంబంధించిన లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియ కావడంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రామ, వార్డు సభలు కిక్కిరిసాయి. తొలిరోజు కావడంతో సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని 25 శాతం గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో సభలను నిర్వహించారు. ఈ సభలకు ఇతర ప్రాంతాల్లో ఉంటున్నవారు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ప్రజాపాలన దరఖాస్తులు చేసినప్పటికీ తుదిజాబితాలో పేర్లు లేకపోవడంపైనే అంతటా రాద్ధాంతం జరిగింది. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై మండిపడ్డారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏటా రూ.12 వేల సహాయం అందుతున్న క్రమంలో ఈ పథకంలోనూ పేర్లు రాలేదని అధికారులను నిలదీశారు.

గ్రామసభల్లో ప్రకటించిన జాబితాలో పేర్లు రానివారు మళ్లీ దరఖాస్తులు చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల్లో చోటు దక్కలేదని పలువురు అధికారులను నిలదీశారు. అదేవిధంగా కొత్త రేషన్‌కార్డుల్లోనూ అన్యాయమే జరిగిందని బాధితులు వాగ్వాదానికి దిగారు. దీంతో మళ్లీ కొత్తగా దరఖాస్తులు చేస్తే పరిశీలిస్తామని అధికారులు చెప్పుకొచ్చారు. చేసేదేమీ లేక ప్రజలు కూడా దరఖాస్తులు సమర్పించారు. రెండో దశలోనైనా తమ అదృష్టాన్ని పరీక్షించుకుందామని దరఖాస్తులు ఇచ్చి అసంతృప్తితో వెనుదిరిగారు.



టేక్మాల్ మండలం శేరిపల్లిలో గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్థులు

సభల్లో పొలిటికల్ వార్

గ్రామాల్లో ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసినప్పటికీ సభల్లో పొలిటికల్ వార్ మాత్రం కొనసాగింది. వచ్చే ఫిబ్రవరి లేదా ఏప్రిల్ నెలల్లో గ్రామపంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఆశావహులంతా సభలపై ఫోకస్ పెట్టారు. జాబితాలో పేర్లున్న వారి చుట్టూ కాంగ్రెస్ కార్యకర్తలు, పేర్లు రాని వారితో బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులు చర్చించడం కనిపించింది. ఈ సభలను అనుకూలంగా మార్చుకుందామని కాంగ్రెస్ కార్యకర్తలు భావించగా లోటుపాట్లపై బీఆర్ఎస్ కార్యకర్తలు నిలదీసే ప్రయత్నం చేశారు. అందరికీ పథకాలు వర్తించాలని ప్రజల తరఫున గులాబీ శ్రేణులు సభల్లో నినాదాలు చేశారు. ఇక పలు చోట్ల ఫ్లెక్సీల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫొటోలు లేవని ఆందోళనకు దిగారు.

మెదక్ జిల్లాలో..

- చిన్నశంకరంపేట మండలం మాదాపూర్‌లో పేర్లు రాలేదని గ్రామస్థులు వాగ్వాదానికి దిగడంతో పోలీసులు సముదాయించారు.
- మనోహరాబాద్ మండలం కోనాయపల్లిలో ఇందిరమ్మ ఆత్మీయ పథకంలో అనర్హుల పేర్లు వచ్చాయని అధికారులతో గొడవ పెట్టుకున్నారు.
- నర్సాపూర్ నియోజకవర్గంలోని సభల్లో అమర్చిన ఫ్లెక్సీలలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఫొటో లేదని బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. అడిషనల్ కలెక్టర్ నగేశ్‌ను నిలదీశారు.

మిగతా 8వ పేజీలో..



గొటిగర్‌పల్లిలో పుష్కలంగా నీరు పోస్తున్న బోరు

కరువుకు చెక్

- చెక్‌డ్యాంలతో గొటిగర్‌పల్లిలో జలసిరులు
- భూగర్భ జలాలను ఒడిసిపట్టిన పల్లె
- పాతికేళ్ల క్రితం ఎటు చూసినా కరువే..
- తాగునీటికీ అప్పట్లో తండ్లాట
- ఇప్పుడు బావులు.. బోర్ల నిండా నీరే
- ఏడాదిలో మూడు పంటలు
- రాజ్యసభలోనూ ప్రస్తావన

7

ఇగం.. జనం ఆగం

- మళ్లీ విజృంభిస్తున్న చలి
- కోహీర్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 7.0 డిగ్రీలు

7

ఆత్మరక్షణ విద్యకు వెన్నుదన్ను

- ఎంఆర్‌సీ గ్రాంటు, కరాటే శిక్షణ నిధులు విడుదల
- సంగారెడ్డి జిల్లాలో 250 స్కూళ్లకు రూ.37.50 లక్షలు
- మెదక్ జిల్లాలో 191 పాఠశాలలకు రూ.23.65 లక్షలు



సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : బాలికలపై దాడులకు అడ్డుకట్ట వేసేందుకు, ఆత్మవిశ్వాసం పెరిగేలా, స్వీయరక్షణకు ఉపయోగపడేలా ప్రభుత్వ పాఠశాలల్లో ఆత్మరక్షణ విద్య నేర్పిస్తున్నారు. రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ (కరాటే శిక్షణ)కింద జిల్లాకు నిధులు విడుదలయ్యాయి. జనవరి, ఫిబ్రవరి, మార్చి మూడు నెలల పాటు ఆయా పాఠశాలల్లోని బాలికలకు కరాటే శిక్షణ ఇచ్చేందుకు శిక్షకుడి కోసం నెలకు రూ.5 వేల చొప్పున వేతనం చెల్లించనున్నారు. ఇందుకు అవసరమైన నిధులను విద్యాశాఖ విడుదల చేసింది. మెదక్ జిల్లావ్యాప్తంగా 191 పాఠశాలలకు రూ.23.65 లక్షలు... సంగారెడ్డి జిల్లాలోని 250 పాఠశాలలకు రూ.37.50 లక్షలు మంజూరు చేసింది.

పీఎంశ్రీ.. సర్కారు బడులకు పెన్నిధి

సంగారెడ్డి జిల్లాలో పీఎంశ్రీ కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో పీఎంశ్రీ సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం కింద విద్యాశాఖ నిధులు మంజూరు చేసింది. ఫేజ్-1 కింద ఎంపికైన 20 ఉన్నత పాఠశాలలకు రూ.5,85,000 నిధులు, ఫేజ్-2 కింద ఎంపికైన 17 సర్కారు స్కూళ్లకు రూ.5,10,000 నిధులు కేటాయించింది. మంజూరైన నిధులను ఆయా పాఠశాలల ఖాతాల్లో జమ చేశారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో 20, రెండో విడతలో 11 పాఠశాలలను పీఎంశ్రీకి ఎంపిక చేశారు. మొత్తం 31 పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రూ.11.81 లక్షలు గతంలోనే మంజూరవ్వగా ఇందుకు సంబంధించిన నిధులు విడుదలయ్యాయి.

ఎంఆర్సీల నిర్వహణకు నిధులు

సంగారెడ్డి జిల్లాలోని మండల వనరుల కేంద్రాల(ఎంఆర్‌సీ-ఎంఈవో ఆఫీస్)నిర్వహణ నిధులు విడుదల చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి జిల్లాలోని 28 మండలాలకుగాను 50 శాతం నిధులను విడుదల చేసింది. ఒక్కో ఎంఆర్‌సీకి రూ.41,460 చొప్పున రూ.11,60,880 నిధులు విడుదలయ్యాయి.

తూప్రాన్ సబ్ రిజిస్ట్రార్‌గా సీనియర్ అసిస్టెంట్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తూప్రాన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ సబ్ రిజిస్ట్రార్‌గా సీనియర్ అసిస్టెంట్‌కు బాధ్యతలు అప్పగించారు. 'జూనియర్ అసిస్టెంటే అక్కడ సబ్ రిజిస్ట్రార్' శీర్షికతో ఈ నెల 17న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రాజ్‌కుమార్‌ను తూప్రాన్‌కు బదిలీ చేసి రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. డీఆర్వో వల్లి సుబ్బలక్ష్మి మౌఖిక ఆదేశాల మేరకు మంగళవారం ఆయన విధుల్లో చేరారు. మొన్నటి వరకు సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ సెలవులో ఉండటంతో రాజ్‌కుమార్‌ను ఇన్‌చార్జిగా నియమించినట్టు కార్యాల వర్గాలు పేర్కొన్నాయి. ఆయన సెలవులు ముగించుకుని వచ్చిన తరువాత కూడా రాజ్‌కుమార్‌ను కొనసాగించాలని డీఆర్వో ఆదేశించినట్టు తెలిసింది.

40 ఎకరాల్లో చెరకు పంట దగ్ధం.. రూ.కోటి నష్టం



7

జోరుగా యాసంగి నాట్లు

యాసంగి నాట్లు జోరందుకున్నాయి. సంక్రాంతికి ముందు పొలాలను దమ్ము చేసుకుని సిద్ధంగా ఉంచుకున్న రైతులు పండుగ అనంతరం చకచకా నాట్లు వేసుకుంటున్నారు. సంగారెడ్డి మండలం కల్పగూర్‌లో రైతులు నాట్లు వేస్తూ బిజీగా ఉన్నారు.

-జిల్లా ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి (ఆంధ్రజ్యోతి)







రెండు డీసీఎంలు ఢీ

మనోహరాబాద్ జనవరి 21(ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం రామయాపల్లి జాతీయ రహదారి వద్ద ఎదురెదురుగా రెండు డీసీఎంలు మంగళవారం ఢీ కొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం రామయాపల్లి 44వ జాతీయ రహదారి వద్ద స్క్రాప్‌లోడ్‌తో హైదారాబాద్ నుంచి వస్తున్న డీసీఎం రామాయపల్లి వద్ద యూటర్న్ తీసుకుంటుండగా ఎదురుగా ఉన్న మరో డీసీఎంను ఢీ కొట్టింది. దీంతో డీసీఎంలో ఉన్న స్క్రాప్ జాతీయరహదారి పై పడగా, కొంతసేపు ట్రాఫిక్ జామైంది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

కరువుకు చెక్



పచ్చని పంటలతో గొటిగర్‌పల్లి గ్రామంలోని పొలాలు

- భూగర్భ జలాలను ఒడిసిపట్టేందుకు చెక్‌డ్యాంలు
- పాతికేళ్ల క్రితం ఎటు చూసినా కరువే..
- తాగునీటికీ అప్పట్లో తండ్లాట
- ఇప్పుడు బావులు.. బోర్ల నిండా నీరే
- ఏడాదిలో మూడు పంటలు
- నీటి కొరత చూడని గొటిగర్‌పల్లి
- రాజ్యసభలోనూ ప్రస్తావన

25 ఏళ్ల క్రితం వర్షాలు వస్తేనే ఆ ఊర్లో పంటలు... లేకుంటే విత్తనాలు వేసేవారు కాదు. కనీసం తాగేందుకు నీరు కూడా దొరకడం గగనమే. తాగునీటి కోసం కోసుల దూరం వెళ్లాల్సి వచ్చేది. బోరుబావులన్నీ అడుగంటిపోయేది. ఎంతలోతు తవ్వినా బోరుబావుల్లో నీటి జాడలు కనిపించేవి కావు. 2006 వరకు ఇదే పరిస్థితి. కానీ, ఊరంతా ఒక్కటై సమష్టిగా పని చేశారు. భగీరథ ప్రయత్నం చేసి కరువును జయించారు. ఇప్పుడా ఊర్లో ఏ బావి చూసినా నిండుగా నీరే. బోర్లలోనూ పుష్కలంగా నీరు. ఒకప్పుడు దుక్కులు దున్ని దిక్కులు చూసిన గ్రామ రైతులు ఇప్పుడు ఏడాదిలో మూడు పంటలు పండిస్తున్నారు. నాడు బీడు భూములుగా కనిపించిన పొలాల్లో ఇప్పుడు పచ్చదనం వెల్లివిరుస్తోంది. అదే సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని గొటిగర్‌పల్లి.

కోహీర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామం నుంచి కరువును తరిమేయాలని నిర్ణయించుకున్న గ్రామస్థులు వర్షపు నీటిని ఒడిసిపట్టాలని భావించారు. తాము ఎంత కష్టపడ్డా ప్రభుత్వ సాయం లేకుంటే ఫలితం ఉండదని, ప్రభుత్వానికి తమ పరిస్థితిని విన్నవించారు. 2001లో అప్పటి ప్రభుత్వం డీపీఏపీ ఆరో దశలో భాగంఅ గొటిగర్‌పల్లికి వాటర్‌షెడ్ పథకాన్ని మంజూరు చేసింది. ఇందుకు గారు రూ. 30 లక్షలను మంజూరు చేసింది. ప్రభుత్వం, అధికారులు అండగా నిలవడంతో గ్రామస్థులంతా సమష్టిగా నడుం బిగించారు. వీరికి తోడుగా విశ్రాంత ఇంజనీరింగ్ ఇన్‌చీఫ్ జన వనరుల నిపుణులు, కీర్తిశేషులు హనుమంతరావు మట్టి కట్టలతో చతుర్విధ జల ప్రక్రియ విధానాన్ని చేపడుతామని ముందుకు వచ్చారు. అంతా కలిసి రూ. 24 లక్షల వ్యయంతో చతుర్విధ జల ప్రక్రియ విధానంలో వాటర్‌షెడ్ పనులు ప్రారంభించారు. ఖర్చు పెట్టిన రూ. 24 లక్షలు సైతం మళ్లీ కూలి రూపంలో గ్రామస్థులకు, రైతులకే చెందాయి. ఈ కార్యక్రమం పూర్తి కావడానికి దాదాపు నాలుగేళ్ల పట్టింది. పనులు ప్రారంభించిన తొలి రోజు నుంచే రైతులు సత్ఫలితాలు పొందారు. ఐదేళ్లలో గ్రామ పరిసరాల్లో భూగర్భ జలాలు పుష్కలంగా పెరిగాయి.

ఊబికి వస్తున్న నీరు..

గొటిగార్‌పల్లి గ్రామంలో వర్షాభావ పరిస్థితుల్లోనూ నీటి కొరత అన్న మాటే వినిపించదు. ఎప్పుడు చూసినా జలవనరుల్లో పదిహేను అడుగుల తోతులోనూ నీరు ఉటుఉంది. గ్రామంలోని ఖాన్‌లోది అనే ప్రాంతంలో కొన్నేళ్లుగా అన్ని కాలాల్లో భూమి నుంచి నీరు ఊబికి వస్తుంటుంది. దీంతో ఆ ఊరి రైతులు ఏటా మూడు పంటలు సాగు చేస్తున్నారు. గతంలో వర్షాధార పంటలు పండించగా, ఇప్పుడు వాణిజ్య పంటలైన అల్లం, అలుగడ్డ, చెరుకు, అరటి వంటి పంటలను సాగు చేస్తున్నారు.

ఏమిటీ చతుర్విధ జల ప్రక్రియ

చతుర్విధ జల ప్రక్రియలో భాగంగా గ్రామంలో మట్టి కట్టలతో చిన్నచిన్న నీటి కుంటలను తవ్వారు. వీలున్న చోట్ల ఇంకుడు గుంతలు నిర్మించారు. సమతల కందకాలను తవ్వారు. ఇందులో 95 శాతం పనులు మట్టితోనే చేపట్టారు. వాగుల ప్రవాహానికి అనుగుణంగా వాటర్‌షెడ్‌లను నిర్మించడంతో, వర్షపు నీటిని ఒడిసిపట్టి నీటిని మళ్లించుకునే అవకాశం వచ్చింది. అంతేకాకుండా భూగర్భజలాలు కూడా పెరిగాయి. వాటర్ షెడ్ల నిర్మాణం వల్ల టాప్ సాయిల్ కొట్టుకుపోకుండా ఉండిపోవడంతో పంటల సాగుకు ఉపయోగంగా మారింది.

రాజ్యసభలో ప్రస్తావన

గొటిగర్‌పల్లి గ్రామంలో చదుర్విధ జల ప్రక్రియ మేరకు చేపట్టిన వాటర్ షెడ్లు.. తర్వాత గ్రామంలో మారిన పరిస్థితులు గతేడాది డిసెంబర్ 5న రాజ్యసభలో ప్రస్తావనకు వచ్చింది. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ఈ మేరకు చరుర్విధ జల ప్రక్రియ ద్వారా భూగర్భ జలాలు పెంచుకున్న గొటిగర్‌పల్లి గ్రామాన్ని ప్రస్తావించారు.

సమష్టి కృషితోనే..



గ్రామస్థుల సమష్టి కృషితో వాటర్ షెడ్ల నిర్మాణం చేపట్టాం. దీంతో భూగర్భ జలాలు పెరిగాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన ఈ విధానాన్ని చేపడితే అన్ని గ్రామాల్లో నీటి కొరత తగ్గుతుంది.
-రాచయ్య, మాజీ సర్పంచు గొటిగరపల్లి

ఏడాదికి మూడు పంటలు ..



గ్రామంలో భూగర్భ జలాలను పుష్కలంగా ఉండడం వల్ల ఏడాది పొడవున్న మూడు పంటలు పండించుకుని లాభాలు పొందుతున్నాం. భూగర్భ జలాలు పెంపొందించడంలో గ్రామస్తులందరి సహకారం ఉంది. ఈ విధానం మిగతా ప్రాంతాల్లో కూడా ప్రభుత్వం అమలు చేస్తే అందరికీ బాగుంటుంది.
-తుక్కప్ప రైతు గొడిగరపల్లి



ఒంటి గుబ్బడి చెక్ డ్యామ్‌లో నిండుగా ఉన్న నీరు.



గ్రామ శివారులోని ఖాన్‌లోది ప్రాంతంలో ఓ బావిలో నిండుగా ఉన్న నీరు

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

● ఆరు నెలల క్రితం భార్య.. ● అనాథైన ఐదేళ్ల కూతురు



కనకయ్య(ఫైల్)

గజ్వేల్ రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గజ్వేల్ మండల పరిధిలోని పిడిచెడ్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బీనమైన కనకయ్య(36) వ్యవసాయ కూలి. అతడి భార్య ఆరు నెలల క్రితం ఆత్మహత్య చేసుకోగా, అప్పటి నుంచి మనోవేదనకు గురవుతున్నాడు. దీనికి ఆర్థిక ఇబ్బందులు తోడవ్వడంతో సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు ఇద్దరూ మృతిచెందడంతో వారి ఐదేళ్ల కూతురు అనాథగా మారింది. గ్రామస్థులు చందాలు వేసుకుని కనకయ్య అంత్యక్రియలు నిర్వహించారు. చిన్నారికి మానవతావాదులు అండగా నిలువాలని స్థానికులు వేడుకుంటున్నారు.

రైలు కిందపడి ఇంటర్ విద్యార్థిని..



భార్గవి (ఫైల్)

చిన్నకోడూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో చదువుకుంటున్న జిల్లా విద్యార్థిని మంగళవారం అక్కడే ఆత్మహత్య చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు గ్రామానికి చెందిన దర్శనం చంద్రయ్య, బాలవ్వ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా చిన్న కుమార్తె భార్గవి(17) ఓయూ క్యాంపస్ ఆంధ్ర మహిళా సభ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతుంది. భార్గవి ఓ వ్యక్తితో చాటింగ్ చేయడం ఆమె అక్కకు తెలిసింది. ఈ విషయం తల్లిదండ్రులకు చెబుతుందేమోనని భయపడిన భార్గవి మంగళవారం జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ సమీపంలో తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ ఏజెన్సీ వర్కర్..

తూప్రాన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మెడికల్ ఏజెన్సీలో పనిచేస్తున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం మాసాయిపేట మండలం కొప్పులపల్లికి చెందిన గౌరారం సాయికుమార్ (22) కొంత కాలంగా తూప్రాన్ పట్టణంలోని మెడికల్ ఏజెన్సీలో పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు చనిపోవడం, సోదరి వివాహం చేసుకుని వెళ్లడంతో ఒంటరిగా ఉంటున్న సాయికుమార్ తూప్రాన్ పట్టణానికి వచ్చి ఏజెన్సీ వాళ్ల ఇంట్లోని ఓ గదిలో నెల రోజులుగా ఉంటున్నాడు. మంగళవారం విధులకు వెళ్లలేదు. దీంతో యజమాని సాయంత్రం గదిలోకి వెళ్లి చూడగా ఉరివేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడి మృతి గల కారణాలు తెలియరాలేదు.

ఏడో తరగతి విద్యార్థి ఆకస్మిక మృతి



నితిన్ (ఫైల్)

నారాయణఖేడ్,జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఏడో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి ఆకస్మికంగా మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఖేడ్ పట్టణంలోని ఇందిరా నగర్‌కాలనీకి చెందిన జయమ్మ కుమారుడు కొండవీటి నితిన్(12) స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లడానికి తయారై బ్రెడ్ తిని టీ తాగాడు. కొద్ది సేపటికి శ్వాస ఆడటం లేదని ఇబ్బంది పడుతుండగా వెంటనే స్థానిక ఏరియా వైద్యశాలకి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎలాంటి జబ్బు లేకున్నా నితిన్ అకస్మాత్తుగా మృతి చెందడటంతో కాలనీ వాసులు కంటతడిపెట్టారు. గుండెపోటు రావడం వల్లే మృతి చెందినట్లు కాలనీ వాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

40 ఎకరాల్లో చెరకు పంట దగ్ధం

● రూ.కోటి మేర నష్టం

జహీరాబాద్, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : మొగుడంపల్లి మండలంలోని ఇప్పెపల్లి గ్రామశివారులోని 15మంది రైతులకు సంబంధించిన 40 ఎకరాల వ్యవసాయ పొలంలో మంగళవారం మధ్యాహ్నం షార్టుసర్క్యూట్‌తో చెరకు పంట దగ్గమైంది. సుమారు 2వేల టన్నుల చెరకు పంట పూర్తిగ కాలి బూడిదైందని రైతులు తెలిపారు.చెరకుపంట, డ్రిప్ పైపులు తదితరాలు కలిసి సుమారు రూ.కోటీ మేర నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. అగ్నిమాపకసిబ్బంది వెళ్లేసరికి దాదాపు పంట మొత్తం కాలిపోయింది. అక్కడికి వెళ్ళిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. కాలిపోయిన పంటపొలాలను మొగుడంపల్లి రెవెన్యూఅధికారులు వెళ్ళి పరిశీంచారు. పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఇగం..జనం ఆగం

- మళ్లీ విజృంభిస్తున్న చలి
- కోహీర్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 7.0 డిగ్రీలు



కోహీర్‌లో దట్టమైన పొగ మంచు

కోహీర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో చలి మళ్లీ విజృంభిస్తున్నది. మూడు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 25 నుంచి 30 డీగ్రీలు ఉంటుండగా, రాత్రి, ఉదయం వేళల్లో మాత్రం కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్‌లో మూడు రోజులుగా సింగల్ డిజిట్ ఉష్ణోగ్రతలే నమోదవుతున్నాయి. ఉదయం చలికి తోడు పొగ మంచు కప్పేస్తుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. జనవరి 10 నుంచి 18 వరకు చలి నుంచి కాస్త ఉపశమనం కలిగినప్పటికీ 19వ తేదీ రాత్రి నుంచి మళ్లీ పెరుగుతూ వస్తోంది. ఈ నెల చివరి వరకు ఇదే తీవ్రత కొనసాగుతుందని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. మంగళవారం ఉదయం సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన కోహీర్‌లో 7.0 ఉష్ణోగ్రత నమోదు కాగా మెదక్ జిల్లాలోని శివంపేట్‌లో 10.5 నమోదైంది. ఇక సిద్దిపేట జిల్లాలోని మర్కుక్ మండలంలో గల అంగడికిష్టాపూర్‌లో 10.2 ఉష్ణోగ్రత నమోదయింది.

నక్కల కులస్థులకు ఎస్టీ సర్టిఫికెట్ ఇవ్వాలి

● రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు వినతి



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తొగుట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో నివసిస్తున్న నక్కల (పిట్టల) కులస్థులకు ఎస్టీ సర్టిఫికెట్ మంజూరీ చేసేవిధంగా చూడాలని సామాజిక సమరసత వేదిక కేంద్ర సమితి సభ్యులు అప్పాల ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రరావు, నక్కల కుల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెతుకు రాజు, సంచార జాతుల రాష్ట్ర కార్యదర్శి చిరంజీవి కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసి వినతి పత్రం అందజేశారు. తొగుట మండలం గోవర్ధనగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నముత్యంపేటలో ఈ కులస్థులు కడు పేదరికంలో మగ్గుతూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో వీరికి ఎస్టీ సర్టిఫికెట్ ఇచ్చారని, కొన్నేళ్లుగా ఇవ్వకపోవడంతో పాటు బీసీ సర్టిఫికెట్ తీసుకోవాలని అధికారులు ఒత్తి తెస్తున్నట్లు తెలిపారు. ఎస్టీ సర్టిఫికెట్ లేక విద్యకు, ప్రభుత్వ పథకాలు దూరమవుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ సంఘం రిటైర్డు జాయింట్ డైరెక్టర్ అంకం శంకర్, సంచార జాతుల సంఘం నాయకులు కాల్వ యాదగిరి, తుమ్మల రాజు, తుమ్మల చిన్న అంబయ్య పాల్గొన్నారు.

ఆర్చరీలో చికితకు స్వర్ణం



చికితను సన్మానిస్తున్న పవన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): కొల్లూర్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో టి.చికితరావు స్వర్ణ పతకం సాధించింది. కాంపౌండ్ విభాగంలో చికిత 697 పాయింట్లతో పసిడి పతకం కైవసం చేసుకుంది. ఎన్.మానస రజతం, ఎం.శ్రేష్ట రెడ్డి కాంస్యం నెగ్గారు. గతవారం జరిగిన జాతీయ స్థాయి ట్రయల్స్‌లో ప్రతిభ కనబర్చి ఫిబ్రవరిలో జరిగే ఆసియా కప్, ఏప్రిల్‌లో జరిగే ప్రపంచకప్‌కు ఎంపికైన చికితను డీపీఎస్ కరస్పాండెంట్ టి.ఎస్ పవన్ కళ్యాణ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీపీఎస్ ఛైర్మన్ టి.భీమ్‌సేన్, వైస్ ఛైర్మన్ టీవీ ప్రణయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లికి అవమానం..!

సరస్వతి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులు



నిజాంపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): చదువుల తల్లికి అవమానం జరిగింది. మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధి నార్లాపూర్ హైస్కూల్‌లోని సరస్వతి మాత విగ్రహాన్ని సోమవారం అర్ధరాత్రి దుండగులు పెకిలించి మెట్లపై పడవేశారు. మంగళవారం గుర్తించిన విద్యార్థులు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. ఏబీవీపీ నేతలు వీరికి మద్దతుగా నిలిచారు. సుమారు గంటపాటు నార్లాపూర్-కల్వకుంట రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు, తహసీల్దార్, ఎంఈవోలు ఘటనా స్థలికి చేరుకొని వారిని సముదాయించారు. దుండగులను వీలైనంత త్వరగా పట్టుకొని అరెస్టు చేస్తామని నచ్చజెప్పడంతో ఎట్టకేలకు ధర్నా విరమించారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో కొందరు ఆకతాయిలు అక్కడ తరచూ మద్యం సేవిస్తూ బాటిళ్ల పడవేసిన సంఘటనలు ఉన్నాయి.



శాటిలైట్ సదస్సును ప్రారంభిస్తున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

ఐఐటీహెచ్‌లో శాటిలైట్ సదస్సు

కంది, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో మంగళవారం అంతర్జాతీయ శాటిలైట్ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తిలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీల్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఇండియా సౌత్‌చాప్టర్ సహఛైర్మన్ డాక్టర్ రామ్‌నాథ్ మణి మాట్లాడుతూ ఐఐటీ పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌ను ఉపయోగించుకోవడం ద్వారా గ్రామీణ, పెరీ అర్బన్ ప్రాంతాల్లో సమస్యలకు సాంకేతికత ఆధారిత పరిష్కారాలను చూపుతున్నామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏఐ ఆధారిత సాధనాలు శ్రామిక మహిళల పనిభారాన్ని తగ్గిస్తాయన్నారు. కార్యక్రమం ద్వారా ప్రాంతీయ వనరుల అన్వేషించడానికి సరికొత్త మార్గాలను కనుగొంటున్నామని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీలు లక్ష్యాలను చేరుకోవాలి

● తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మిబాయి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మిబాయి

గజ్వేల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీలకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మిబాయి సూచించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఆయా మార్కెట్ కమిటీల కార్యదర్శులతో ఆమె మంగళవారం సమీక్ష నిర్వహించారు. లక్ష్యాలను చేరుకున్న కార్యదర్శులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్ కమిటీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిర్ణిత గడువులోగా టార్గెట్ పూర్తి చేయాలన్నారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా లక్ష్యాలను పూర్తి చేసేందుకు చేపట్టవలసిన చర్యలపై సలహాలు, సూచనలు చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్, జిల్లా మార్కెట్ అధికారి, ఆయా మార్కెట్ కమిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భార్య మీద కోపంతో కూతురిని చంపిన తండ్రి

- గొంతు నులిమి బావిలో పడేసిన వైనం
- అమ్మ దగ్గరకి తీసుకెళ్తానని చెప్పి హత్య
- సంగారెడ్డి జిల్లాలో దారుణం, నిందితుడి అరెస్టు



వైష్ణవి(ఫైల్)

రాయికోడ్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లాడిన భార్య తన వేధింపులు తాళలేక పుట్టింటికి వెళ్లిపోతే.. ఆమెపై కోపాన్ని కన్నబిడ్డ మీద చూపించాడో తండ్రి. అమ్మ దగ్గరికి తీసుకెళ్తానని చెప్పి నమ్మించి కూతురిని తీసుకెళ్లి.. గొంతు నులిమి ఊపిరి తీసి మృతదేహాన్ని బావిలో పారేశాడు. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలో జనవరి 9న ఈ దారుణం జరగ్గా.. కన్నబిడ్డను చంపిన ఆ తండ్రిని పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హన్మంతు, రాయికోడ్ ఎస్ఐ నారాయణ ఈ కేసు వివరాలను విలేకరులకు మంగళవారం వెల్లడించారు. వారి కథనం ప్రకారం.. రాయికోడ్ మండలం సంగాపూర్‌కు చెందిన మధుగడ్డ సతీశ్, ఎరుకలి అనిత ఒకరినొకరు ప్రేమించుకుని 12 ఏళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి వైష్ణవి (11), హరిత (6) అనే కుమార్తెలు ఉండేవారు. సతీశ్ అనుమానంతో అనితను తరచూ వేధిస్తుండేవాడు. ఈ వేధింపులు తాళలేక భర్త, పిల్లలను వదిలేసి అనిత ఏడాది క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పట్నించి సతీశ్ తల్లి సామమ్మ పిల్లల బాగోగులు చూసేది. అయితే, సతీశ్ భార్య మీద కోపంతో రగిలిపోతుండేవాడు. చిన్న కుమార్తె హారిక అనారోగ్యంతో రెండు నెలల క్రితం మరణించింది. అప్పట్నించి వైష్ణవి తన తల్లి దగ్గరికి వెళ్లిపోతానని అడిగేది. అయితే, భార్య తనని వదిలేయడం, ఉన్న కూతురు తన దగ్గర ఉండనని అంటుండంతో.. సతీశ్ తన కూతురిని చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో అమ్మ దగ్గరకు తీసుకెళ్తానని చెప్పి జనవరి 9వ తేదీ తెల్లవారుజామున సతీశ్ తన కూతురు వైష్ణవిని గ్రామ శివారులోని ఓ బావి వద్దకు తీసుకెళ్లాడు. ఇక్కడికి ఎందుకు తెచ్చావు అని కూతురు ప్రశ్నించగా.. ఆమె గొంతు నులిమి ప్రాణం తీసి మృతదేహాన్ని బావిలో పారేసి ఇంటికి తిరిగి వచ్చాడు. వైష్ణవి ఏదని తల్లి సామమ్మ ప్రశ్నించగా సతీశ్ పొంతన లేని సమాధానాలు చెప్పాడు. అక్కడికి వారం తర్వాత బావి వద్ద వైష్ణవి దుస్తులు, ఆధార్‌కార్డు, చెప్పులు గుర్తించిన స్థానికులు విషయాన్ని సామమ్మకు చెప్పారు. సామమ్మ ఫిర్యాదుతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు వైష్ణవి మృతదేహాన్ని వెలికి తీసి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో సతీశ్‌ను ప్రశ్నించగా అసలు నిజం బయటపడింది.

250 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

జోగిపేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 250 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సంగారెడ్డి జిల్లా జోగిపేట పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం లారీలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్టు పోలీసులకు నమ్మదగిన సమాచారం వచ్చింది. ఈ మేరకు మంగళవారం ఉదయం జోగిపేట పట్టణంలోని బసవేశ్వర విగ్రహం వద్ద బియ్యం లోడుతో ఉన్న లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, రెవెన్యూ అధికారులు బియ్యాన్ని పరిశీలించి రేషన్ బియ్యంగా నిర్ధారించారు. నారాయణ ఖేడ్‌లోని సివిల్ సప్లయ్స్ గోదాముకు బియ్యాన్ని తరలించామని, లారీ డ్రైవర్ యూసుఫ్‌ను అదుపులోనికి తీసుకుని విచారిస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

హెచ్ఎండీఏ వెంచర్‌లో విద్యుత్ వైర్లు చోరీ

● రూ.2లక్షల విలువైన తీగలు మాయం

కంది, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అల్యూమినియం తీగలు చోరీకి గురైన సంఘటన కంది మండల పరిధిలోని చేర్యాల శివారులో మంగళవారం చోటుచేసుకుంది. ఇంద్రకరణ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం చేర్యాల శివారులోని కంది-శంకర్‌పల్లి హైవే పక్కన ప్యారడైజ్ ఇన్‌ఫ్రా పేరిట 12ఎకరాల్లో హెచ్ఎండీఏ వెంచర్ ఉన్నది. సోమవారం అర్ధరాత్రి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు వెంచర్‌లోనికి చొరబడి రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు చెందిన ఫీజులను తొలగించి ఎల్టీ లైన్ స్తంభాల పైకి ఎక్కి విద్యుత్ తీగలను కత్తిరించుకుని తీసుకెళ్లారు. దాదాపు 30 స్తంభాలకు చెందిన నాలుగు వరసలు గల విద్యుత్ అల్యూమినియం తీగలను తస్కరించారు. మంగళవారం ఉదయం విధులకు హాజరైన వెంచర్ సూపర్‌వైజర్ హాజీ విద్యుత్ తీగలు చోరీకి గురయ్యాయని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెల్లడించారు. రూ. 2 లక్షల విలువ చేసే విద్యుత్ తీగలు చోరీకి గురైనట్లు విద్యుత్‌శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

పీహెచ్‌సీకి నోచుకోని తెల్లాపూర్

- లక్షల్లో జనాభా ఉన్నా పట్టించుకోని వైనం
- అటకెక్కిన మంత్రి హామీ
- వైద్యమందక వలస కూలీల ఇబ్బందులు

రామచంద్రాపురం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలు, కాలనీలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఉపాధి అవకాశాలు మెండుగా ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి నిరుద్యోగులు వలస వచ్చి కూలీలుగా స్థిర పడ్డారు. దీంతో ఇక్కడ 2 లక్షలకు పైగా జనాభా ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక్కడివరకు బాగానే ఉన్నా.. ఇప్పటివరకూ తెల్లాపూర్‌లో పీహెచ్‌సీ లేదంటే ప్రభుత్వ నిర్లక్ష్యం ఏమేరకు ఉందో అర్థమవుతోంది. ఈ ప్రాంతంలో ఉన్నత వర్గాలు అధికంగా నివాసాలు ఏర్పరుచుకోవడం, దుకాణాల ఎదుట పార్కింగ్ లేకపోవడం, రోడ్డుపైనే పార్కింగ్ చేయడం, రోడ్డు పనులు పూర్తికాకపోవడం కారణంగా నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఘటనల్లో మృతుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఇటీవల కాలంలో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకులు మృతిచెందారు. ఉస్మాన్‌నగర్‌కు చెందిన బన్నీ, మరో యువకుడు బైక్‌పై వస్తూ టిప్పర్ లారీ కిందిపడి దుర్మరణం చెందారు. మరో యువకుడు గుర్తు తెలియని వాహనం ఢీకొని చికిత్స పొందుతూ మూడురోజుల తర్వాత చనిపోయాడు. ఈ సంఘటనలన్నీ కొత్త సంవత్సరంలోనే జరిగాయి. రోడ్డు ప్రమాదాలు నివారించడంలో ట్రాఫిక్ పోలీసులు పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలకు ఏదైనా వైద్యపరంగా అవసరం వస్తే నానా అవస్థలు పడాల్సి వస్తోంది. సరైన సమయంలో వైద్యమందక చాలా మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


పీహెచ్‌సీగా మారుస్తామన్న పాత మున్సిపల్ భవనం

అందుబాటులోని అంబులెన్స్

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఒక్క అంబులెన్స్ కూడా అందుబాటులో లేదు. ప్రమాదాలు జరిగినప్పుడు 108కు ఫోన్‌చేస్తే గచ్చిబౌలికి వెళ్తుంది. అక్కడి సిబ్బంది తాము రామని తేల్చి చెబుతూ నిరాకరిస్తున్నారు. ఇటీవల ఓ వలస కూలీ రెండో అంతస్తులో పనిచేస్తూ కిందపడ్డాడు. తీవ్రగాయాలైన కూలీకి సకాలంలో వైద్యమందక దారిలోనే చనిపోయాడు. అంబులెన్స్ ఉంటే బతికేవాడని తోటి కూలీలు పేర్కొన్నారు.

అటకెక్కిన మంత్రి హామీ

తెల్లాపూర్ మున్సిపల్ నూతన భవనాన్ని జూన్ 22, 2024 నాడు మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, స్థానికులు, నాయకులు తెల్లాపూర్‌లో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని కోరారు. పీహెచ్‌సీ ఏర్పాటుకు పాత మున్సిపల్ భవనం అందుబాటులో ఉందని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 15 రోజుల్లో పాత మున్సిపల్ భవనంలో పీహెచ్‌సీని ఏర్పాటు చేస్తామని, కావాల్సిన సిబ్బందిని ఏర్పాటు చేస్తామని హామీఇచ్చారు. ఆరునెలలు పూర్తయినా నేటివరకూ ఆ హామీ నెరవేరలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తెల్లాపూర్‌లో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అభివృద్ధిలో ఐడిఏబొల్లారం ఆదర్శం: ఎమ్మెల్యే

ఐడిఏబొల్లారం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి చేయడంలో ఐడిఏబొల్లారం పురపాలక సంఘం ఆదర్శంగా ఉందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఐడిఏ బొల్లారం పురపాలక పట్టణంలో రూ.69.4 కోట్లతో చేసిన అభివృద్ధి పనులను పురపాలక సంఘం చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో అభివృద్ధి విషయంలో ప్రత్యక్షంగా చేసి చూపించి ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా మారారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, కౌన్సిలర్లు చంద్రయ్య, బాలామణి, సంధ్య, వేణుపాల్‌రెడ్డి, గోపాలమ్మ, కిరణ్‌కుమార్‌రెడ్డి, సంతోష, హారిక వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


సీసీరోడ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

మెట్రోను ఇస్నాపూర్ వరకు విస్తరించండి

సంగారెడ్డి రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మెట్రో రైల్‌ను మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు విస్తరించాలని మెట్రో సాధన సమితి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కే.సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గత ప్రభుత్వం మెట్రో రైల్‌ను ఇస్నాపూర్ వరకు విస్తరించాలని ప్రతిపాదించిందని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జారీచేసిన జీవోలో పటాన్‌చెరు వరకు మాత్రమే ప్రతిపాదించిందన్నారు. సంగారెడ్డి జిల్లాకు ప్రయోజనం కలగాలంటే పారిశ్రామిక వాడైన ఇస్నాపూర్ వరకు మెట్రోను పొడిగించాలన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేలా చొరవ తీసుకోవాలని మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీఇచ్చినట్టు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో మెట్రో సాధన సమితి సభ్యులు శంకర్, అన్వర్ పటేల్, మెట్టు శ్రీధర్, రమేష్ తదితరులు ఉన్నారు.


మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న సత్యనారాయణ

ప్రభుత్వ పథకాలు అందించడం కోసమే గ్రామసభలు


ఖేడ్‌లో నిర్వహించిన గ్రామసభలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి


ఔరంగాబాద్ తండా గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ప్రభుత్వ పథకాలు అందించడం కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేట, చాంద్‌ఖాన్‌పల్లి, మాద్వార్‌లలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. కంది మండల పరిధిలోని చేర్యాల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, జహీరాబాద్ పట్టణంలోని 1, 2వ వార్డులతో పాటు మొగుడంపల్లి మండలంలోని గౌడిగార్‌పల్లి తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రజాపాలన సభలను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు. ఝరాసంగం మండల పరిధి క్రిష్ణాపూర్‌లో నిర్వహించిన సభలో ట్రైనీ కలెక్టర్ మనోజ్ పాల్గొన్నారు. అలాగే సంగారెడ్డి రూరల్, కల్హేర్, సిర్గాపూర్, జిన్నారం, హత్నూర, మనూరు, కంగ్టి, నాగల్‌గిద్ద, కోహీర్, పుల్‌కల్ మండలాల్లో గ్రామసభలు నిర్వహించారు. అలాగే మెదక్ హవేళిఘణపూర్ మండలం ఔరంగాబాద్‌తండాలో, మెదక్ మండలం శివాయపల్లి గ్రామంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, మెదక్ మండలం, చేగుంట, రామాయంపేట, కొల్చారం, నిజాంపేటలోని ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు.

వ్యవసాయ రంగంపై పట్టు సాధించాలి

- ట్రైనీ కలెక్టర్ మనోజ్

సంగారెడ్డి రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగంపై డీలర్లు పట్టు సాధించినప్పుడే రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు జాగ్రత్తలు సూచించే వీలుంటుందని ట్రైనీ కలెక్టర్ మనోజ్ అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో మంగళవారం డీలర్లకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు ఏదేని సమస్యలపై వస్తుంటారని డీలర్లు వ్యవసాయ రంగంపై అవగాహన పెంచుకుంటే సమస్యలను నివృత్తి చేయగలరని సూచించారు.

అక్రమాలకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలి

- డీఆర్డీవో అదనపు పీడీకి గ్రామస్థుల ఫిర్యాదు


డీఆర్డీవో అదనపు పీడీ బాల్‌రాజుకు ఫిర్యాదు చేస్తున్న మక్తాఅల్లూరు గ్రామస్థులు

కంది, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కంది మండలం మక్తాఅల్లూరు గ్రామస్థులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ గ్రామంలో జరిగిన గ్రామసభలో ఉపాధిహామీలో భాగాంగా ఏర్పాటుచేసిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో 20 రోజుల పాటు పనిచేయకున్నా కొందరి పేర్లు అర్హుల జాబితాలో ఉండడం కలకలం రేపింది. ఆ గ్రామ ఉపాధిహామీ కూలీలతో పాటు గ్రామస్థులు కూడా అనర్హులకు హాజరు ఎలా వేశారని ఆందోళన చేశారు. ఈ విషయంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌తో పాటు పలువురు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తలారి ప్రభు, నర్సింలు, పాపయ్య, వడ్ల వెంకట్, మధు, నరేశ్, అనిల్, రమేశ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పార్టీ బలోపేతానికి కృషి చేయాలి'

నారాయణఖేడ్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం నారాయణఖేడ్‌లో ఎంఐఎం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖేడ్ పట్టణ అధ్యక్షుడు, న్యాయవాది మోహిద్‌పటేల్ ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చాంద్‌పాష, మహ్మద్ మజహార్, షేక్‌అంజద్, సల్మాన్‌పటేల్, ఇస్మాయిల్, అహ్మద్‌పటేల్ పాల్గొన్నారు. కాగా నారాయణఖేడ్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఉర్దూ మీడియంలో చదువుతున్న విద్యార్థినులకు ఆయన టెస్టు పేపర్లను పంపిణీ చేశారు.

శ్మశానవాటిక స్థలం కబ్జా

వెల్దుర్తి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తికి చెందిన సర్వే నంబరు 132లోని 2.20 ఎకరాల శ్మశానవాటిక స్థలం కబ్జాకు గురైంది. ఆ సర్వే నంబరుకు ఆనుకుని ఉన్న ఓ రైతు ఎక్స్‌కవేటర్ సహాయంతో చదును చేశాడు. కబ్జాకు గురైన శ్మశానవాటిక స్థలాన్ని కాపాడాలని తహసీల్దార్ కృష్ణకు గ్రామస్థులు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

హడావిడి ప్రారంభోత్సవాలు ఏమిటో?

మెదక్, జనవరి 21, (ఆంధ్రజ్యోతి): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రూ.16.54 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు అధికారులు హుటాహుటిన ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు మున్సిపల్ అధికారి ఒకరు తెలిపారు. గతంలో ఏ చిన్న పనిచేపట్టినా హడావిడి చేసే నాయకులు రూ.కోట్లతో చేపట్టే పనులకు సంబంధించి హంగామా లేకుండానే చేపడుతున్నారు. ఇక్కడ మున్సిపల్ పాలకవర్గం బీఆర్ఎస్‌ది కావడం.. మరి కొన్నిరోజుల్లో పదవీకాలం పూర్తికానుండటంతో ఆర్భాటం లేకుండా తలపెట్టినట్లు తెలుస్తోంది. ఉదయం ప్రారంభోత్సవాలు జరగనుండగా, ఇప్పటివరకు కౌన్సిలర్లకూ సమాచారం ఇవ్వలేదు. రాత్రివరకు శిలాఫలకాలు ఏర్పాటు చేయలేదని తెలిసింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులకూ సమాచారం లేదని తెలుస్తోంది.


చిన్నశంకరంపేట మండలం టీమాందాపూర్‌లో గ్రామస్థులను సముదాయిస్తున్న సీఐ వెంకటరాజాగౌడ్


ఫ్లెక్సీలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఫొటో లేదని అదనపు కలెక్టర్‌తో వాగ్వాదం

నిలదీతలు.. వాగ్వాదాలు

5వ పేజీ తరువాయి

- చిలప్‌చెడ్ మండలం అజ్జమర్రి గ్రామంలో ఇందిరమ్మ కమిటీ పేర్లలో మార్పులు జరిగాయని గ్రామస్థులు ఆందోళన చేపట్టారు.
- చేగుంట మండలం ఇబ్రహీంపూర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు ఫొటోలు లేవని కార్యకర్తలు ఫ్లెక్సీలను తొలగించారు.
- వెల్దుర్తి మండలం శెట్టిపల్లిలో అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో ఎంపికైన 40 మందికి భూములు ఉన్నాయని, అనర్హులకు పెద్దపీట వేశారని మండిపడ్డారు.
- టేక్మాల్ మండలం ఎల్లకుర్తి, శేరిపల్లి గ్రామసభల్లో గ్రామస్థులు తీవ్రంగా మండిపడ్డారు. అనర్హుల పేర్లే జాబితాలలో కనిపిస్తున్నాయని ఆందోళనకు దిగడంతో రసాభాసగా మారాయి.

సంగారెడ్డి జిల్లాలో..

- ఝరాసంగం మండలం మాచునూరులో సభకు వచ్చిన అధికారులు సరిగా వినతులు స్వీకరించలేదు. ఇదే గ్రామానికి చెందిన దివ్యాంగుడు లాజర్ తనకు ఇల్లు రాలేదని సభలోనే కన్నీటి పర్యంతమయ్యాడు.
- గుమ్మడిదల మండలం కొత్తపల్లి, గుమ్మడిదల, అనంతారం, బొంతపల్లి, దోమడుగు, అన్నారంలో జరిగిన సభల్లో ప్రజలు అసంతృప్తి వ్యక్తపరిచారు.
- జిన్నారం మండలం మంగపేటలో ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా అమలు చేయాలంటూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. జగ్గంపేటలోనూ జాబితాలో పేర్లు లేవని నిలదీయడంతో దరఖాస్తులు స్వీకరించారు.
- సంగారెడ్డి జిల్లాలోని అన్ని గ్రామసభలు, వార్డు సభల వద్ద ఆందోళనలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

న్యూస్ బాక్స్

సాంకేతిక కారణాలతో సదరం క్యాంపు రద్దు

సంగారెడ్డి అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక కారణాలతో ఈనెల 28న సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించాల్సిన సదరం క్యాంపును రద్దు చేస్తున్నట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ ఒక ప్రకటనలో తెలిపారు. సదరం వెబ్‌సైట్‌లో సాంకేతిక మార్పులు చేర్పులు చేస్తున్న నేపథ్యంలో క్యాంపు నిర్వహించడం లేదని తదుపరి నిర్వహించే తేదీలను ప్రకటిస్తామని తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే వివేక్

సంగారెడ్డి రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం అధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను మంగళవారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్, తెలంగాణ అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు జగన్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు అశోక్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం పట్టని ప్రభుత్వాలు: సీపీఎం

హత్నూర, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలి, రాజకీయ స్వలాభాల కోసం పనిచేస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నర్సింలు అన్నారు. ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభల విజయవంత కోసం చేపట్టిన జీపుజాత మంగళవారం మండలంలోని దౌల్తాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ.. కల్లబొల్లి హామీలతో గద్దెనెక్కిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయని ఆరోపించారు.

'యోగాతో ఆరోగ్యం'

మెదక్ జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : యోగాసనాలతో ఆరోగ్యం కలుగుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్ అన్నారు. టెటి మాస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆరోగ్యంపట్ల అవగాహన కల్పించారు.

'బడీఈడు పిల్లలను బడిలో చేర్పించాలి'

వెల్దుర్తి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : బడీఈడు పిల్లలు బడిలో ఉండి చదువుకోవాలని సీఆర్పీ రాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చర్లపల్లిలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా చర్లపల్లి గ్రామానికి చెందిన ఏరోళ్ల సునీతాను వెల్దుర్తి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో, శివచరణ్‌ను వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో చేర్పించారు.

మాఘ అమావాస్య స్నానాలను సద్వినియోగం చేసుకోండి

నారాయణఖేడ్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పరిధిలోని బోరంచ శివారులోని చరిత్రాత్మకమైన సంగమేశ్వర దేవస్థానం ఆవరణలో మాఘ అమావాస్యను పురస్కరించుకొని, మాఘస్నానాల ఉత్సవాలను జయప్రదం చేయాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఖేడ్‌లో ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. 28న రాత్రి ప్రత్యేక భజనలు, 29న ఉదయం నుంచి క్షీరాభిషేకం, రుద్రహోమం, అన్నదానాలు ఉంటాయని, ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి దంపతులు పాల్గొంటారన్నారు.

సోషల్ టాలెంట్ టెస్టు రాష్ట్రస్థాయిలో దుర్గకు రెండో బహుమతి

నారాయణఖేడ్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సోషల్ టాలెంట్ టెస్టు రాష్ట్రస్థాయి పోటీల్లో తమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని దుర్గ రెండో బహుమతి దక్కించుకుందని ఇన్‌చార్జి హెచ్‌ఎం కిషన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయిలో రెండో బహుమతి దక్కించుకోవడం పట్ల దుర్గను, సాంఘీక శాస్త్రం ఉపాధ్యాయులు శివాజీరాథోడ్, పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎం.విశ్వనాథ్, ఉపాధ్యాయులు అభినందించారు.

కూలిన భవనం పరిశీలన

మనోహరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండలం కూచారం గ్రామంలో యువజన భవనం సజ్జ ముందుభాగం శనివారం కూలిపోయిన విషయం తెలిసిందే. కాగా విషయం తెలుసుకున్న మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఈఈ నర్సింహులు మంగళవారం యువజన సంఘం భవనాన్ని పరిశీలించారు.

పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

మనోహరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా శ్రీధర్, కోశాధికారి అజయ్‌ను జిల్లా అధ్యక్షురాలు మాయకల జయరాములు నియమించారు.

పొగాకు ఉత్పత్తుల వినియోగంతో ముప్పు


ఖేడ్‌లో పొగాకు నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

నారాయణఖేడ్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల ఆరోగ్యాలకు ముప్పు వాటిల్లుతుందని సంగారెడ్డి జిల్లా పొగాకు నియంత్రణ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఖేడ్ పట్టణ సంత రోజు కావడంతో రాజీవ్‌చౌక్, మార్కెట్ల వద్ద అవగాహన కార్యక్రమంలో భాగంగా మాట్లాడారు.

చిరుధాన్యాల్లో పోషకాలు అధికం: డీడీఎస్

జహీరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : చిరుధాన్యాల్లోనే పోషకాలు అధికంగా ఉంటాయని డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.దివ్య పేర్కొన్నారు. పాత పంటల జాతరలో భాగంగా మంగళవారం అల్గోల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అన్నిరకాల వాతావరణానికి తట్టుకుని చిరుధాన్యాలు పండుతాయన్నారు. చిరుధాన్యాల సాగులో పెద్దగా పెట్టుబడి అవసరం లేదన్నారు. ఆరోగ్యాన్నిచ్చే పంటలను పండిస్తున్న డీడీఎస్ మహిళా రైతుల కృషిని ఆమె అభినందించారు. అనంతరం డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త సాయి ప్రియాంక, జాతర కోఆర్డినేటర్లు విజయ్‌కుమార్, మంజుల, డీడీఎస్ మహిళా రైతులు అల్గోల్ నర్సమ్మ, చుక్కమ్మ, మల్లన్న, బక్కప్రభు మాట్లాడారు. అనంతరం గ్రామంలో చిరుధాన్యాలతో అలంకరించిన ఎడ్లబండ్లను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో రైతులు, డీడీఎస్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సులు నడపండి

సంగారెడ్డి అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : డయల్ యువర్ సంగారెడ్డి డీఎం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందులో ప్రయాణికుల నుంచి 12 విజ్ఞప్తులు వచ్చాయి. డిపో మేనేజర్ ఉపేందర్ ప్రయాణికుల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. సంగారెడ్డి నుంచి పటాన్‌చెరుకు బస్సుల సంఖ్య పెంచాలని కంది నుంచి మల్లేశ్ కోరారు. సంగారెడ్డి నుంచి నారాయణఖేడ్ వరకు పల్లెవెలుగు బస్సులు నడపాలని పెద్ద శంకరంపేట నుంచి నిరంజన్‌రమణ విజ్ఞప్తి చేశారు. శంకర్‌పల్లి రూట్‌లో బస్సుల సంఖ్య పెంచాలని ఎద్దుమైలారం నుంచి వీరప్ప కోరారు. సంగారెడ్డి నుంచి జేబీఎస్‌కు ఉదయం పూట బస్సుల సంఖ్య పెంచాలని సంగారెడ్డి నుంచి సూర్యప్రకాశ్ కోరారు.

వరల్డ్ కన్జ్యూమర్ రైట్స్ సంస్థ జిల్లా వైస్ చైర్మన్‌గా ప్రకాశ్


పుల్లూరి ప్రకాశ్

సంగారెడ్డి అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : వరల్డ్ కన్జ్యూమర్ రైట్స్ సంస్థ సంగారెడ్డి జిల్లా వైస్ చైర్మన్‌గా పుల్లూరి ప్రకాశ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు నలమాసు శ్రీకాంత్‌గౌడ్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ వినియోగదారుల అవగాహనతో పాటు బాధ్యతలు తెలియజేయడం తమ ప్రధాన కర్తవ్యమన్నారు. ఇప్పటికే 4 రాష్ట్రాల్లో సంస్థ కార్యకలాపాలు ప్రారంభించిందని త్వరలోనే దక్షిణ భారతదేశంలో అన్నిరాష్ట్రాల్లో సంస్థ కార్యక్రమాలు ప్రారంభిస్తున్నామని ప్రకాశ్ తెలిపారు.

పదవీ విరమణ వయస్సును పెంచొద్దు

- టీజేఎంయూ రాష్ట్ర కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి

సంగారెడ్డి అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులు, కార్మిక ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును ప్రభుత్వం పెంచవద్దని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్(టీజేఎంయూ) రాష్ట్ర కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి ఒక ప్రకటనలో కోరారు. ఉద్యోగ విరమణ వయస్సును 63 ఏళ్లకు పెంచుతున్నట్లుగా జరుగుతున్న ప్రచారంపై ప్రభుత్వ పెద్దలు స్పందించాలని సూచించారు. గత కేసీఆర్ ప్రభుత్వం గతంలో మూడేళ్ల పెంచి సర్వత్రా విమర్శలుపాలైందని వాపోయారు. ఉద్యోగ విరమణ వయస్సు పెంచడమంటే లక్షల మంది నిరుద్యోగుల నోట్లో మట్టికొట్టినట్టేనన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని ఖండించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

ముగిసిన చాముండేశ్వరి వార్షికోత్సవాలు

చిలప్‌చెడ్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులో మంజీరా తీరాన వెలిసిన చాముండేశ్వరిమాత 42వ వార్షికోత్సవాలు ముగిశాయి. చివరిరోజు కావడంతో వేదపండితులు పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం అభిషేకాలు నిర్వహించి, అమ్మవారిని అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో సంగారెడ్డి బాలాజీ ఆస్పత్రి వారు రోగుల కోసం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు.

సీనియర్ అసిస్టెంట్‌కు బాధ్యతలు

తూప్రాన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈనెల 17న ఆంధ్రజ్యోతిలో 'జూనియర్ అసిస్టెంటే అక్కడ సబ్ రిజిస్ట్రార్' అంటూ కథనం ప్రచురితమైంది. దాంతో తూప్రాన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ విధులు నిర్వహించేందుకు సీనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు డీఆర్‌వో వల్లి సుబ్బలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. మొన్నటి వరకు సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ సెలవులో ఉండటంతో రాజ్‌కుమార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు.

శ్రీకర్ ఆర్గానిక్ పరిశ్రమ యాజమాన్యంపై కేసు

ఐడిఏబొల్లారం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఐడిఎబొల్లారం పారిశ్రామికవాడలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఏడుగురు కార్మికులు గాయపడటానికి యాజమాన్యం జాగ్రత్తపరమైన చర్యలు తీసుకోలేదని కార్మికులు కాంట్రాక్టర్ సహదేవ్‌తో కలిసి ఫిర్యాదు చేశారని సీఐ రవీందర్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సంగారెడ్డి క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మంగళవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్టు పట్టణ సీఐ ఎస్.రమేష్ తెలిపారు. ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డు ఎదుట ఉన్న సిమెంట్ బెంచ్‌పై స్పృహ లేకుండా పడి ఉండగా సెక్యూరిటీ గార్డు కల్పగూరి ఆంజనేయులు అతడిని ఆస్పత్రిలో చేర్పించాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారన్నారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచామని తెలిపారు. సదరు వ్యక్తి ఆసుపత్రి చుట్టుపక్కల దుకాణాల్లో బిక్షాటన చేస్తూ ఉండేవాడని, ఎవరైనా గుర్తిస్తే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

మాసాయిపేటలో యువతి అదృశ్యం

మెదక్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : యువతి అదృశ్యమైన సంఘటన మాసాయిపేట మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. చేగుంట పోలీసుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన శివంపేట ప్రవళిక(21) సోమవారం మధ్యాహ్నం స్నేహితుల దగ్గరికి వెళ్లి వస్తానని కనిపించకుండా పోయింది. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు బంధువుల, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'నాయీబ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాలి'

సంగారెడ్డి రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : నాయీబ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. సంగారెడ్డిలోని పాత జడ్పీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంగారెడ్డి పట్టణంలో నాయీబ్రాహ్మణులు అధిక సంఖ్యలో ఉన్నా రాజకీయంగా అభివృద్ధి చెందలేదని, ఐకమత్యంతోనే అభివృద్ధి సాధిస్తామన్నారు. అనంతరం సంఘం సంగారెడ్డి పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా మాణిక్‌ప్రభు, గౌరవ అధ్యక్షుడిగా దత్తాత్రేయ, వర్కింగ్ ప్రెసిడెంగ్‌గా సాయినాథ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా ప్రభు, సహాయ కార్యదర్శిగా మురహరి, కోశాధికారిగా ఎస్.ప్రభు, ప్రచార కార్యదర్శిగా కుమార్, సలహాదారులుగా పెంటయ్య, వీరభద్ర, అంజయ్య, రాంచందర్, దుర్గేష్, యూత్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రమేష్, శ్రీహరి, మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు ఆకాశవేణి తదితరులు పాల్గొన్నారు.